నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
సోమవారం | డిసెంబర్ 18, 2023 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ సురేష్ నాయక్ ఆదివారం హైదరాబాద్‌లో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. లక్షెటిపేట మున్సిపాలిటీలోని 1వ వార్డు కౌన్సిలర్ కొనసాగుతున్న ఆయన కాంగ్రెస్ హాయంలోనే తమ వార్డు అభివృద్ధి చెందుతుందని పార్టీలో చేరినట్టు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ షాహిద్‌ఆలీ, బొప్ప సతీష్ పాల్గొన్నారు.

ముగిసిన హ్యాండ్ బాల్ పోటీలు

నవతెలంగాణ-మందమర్రి



మందమర్రి సింగరేణి హై స్కూల్ మైదానంలో నిర్వహించిన 3వ ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ స్కూల్ లీగ్-2023 పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో టీఎస్‌టీబ్ల్యూఆర్‌జేసీ జైపూర్ జట్టు, బాలికల విభాగంలో టీఎంఎస్ఎస్ ఆసిఫాబాద్ జట్లు మొదటిస్థానంలో నిలిచాయి. గెలుపొందిన విజేతలకు మంచిర్యాల జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ సంఘ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్ రావ్, కార్యదర్శి కనపర్తి రమేష్, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో అగ్ని ప్రమాదం

- ఆదివారం కావడంతో తప్పిన పెను ప్రమాదం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదుల్లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. షాట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని తెలుస్తోంది. ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. భారీగా ఎగిసి పడుతున్న మంటలను అదుపులోకి తెచ్చేందుకు స్థానికులు ప్రయత్నం చేశారు. స్థానికంగా ఫైర్ స్టేషన్ లేకపోవడంతో మంటలు అదుపులోకి తీసుకు రావడానికి అవకాశం లేకుండా పోయింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై లక్ష్మణ్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం ధర్మపురి నుంచి ఫైర్ ఇంజన్ పిలిపించి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలను అర్పడానికి తన వంతు కృషి చేసిన ఎస్సై లక్ష్మణ్‌కు, ఫైర్ సిబ్బంది లక్ష్మి నారాయణ, శ్రీనివాస్, శంకరయ్యను పట్టణ ప్రజలు అభినందించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-మందమర్రి

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించి వేతనాలు పెంచాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు ఆదివారం మందమర్రికి వచ్చిన సందర్భంగా వారికి కాంట్రాక్టు కార్మిక సంఘం సీఐటీయూ తరఫున వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో 18 రోజులు సమ్మె చేస్తే 12 డిమాండ్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంకుస్, నాగరాజు, అనిల్, రంజిత్, ఐలన్న, సాయి, దేవేందర్, మహేందర్, మహేష్ పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో పెద్దపెల్లి ఎంపీ పర్యటన



నవతెలంగాణ-జన్నారం

పెద్దపెల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత తన స్వగ్రామమైన జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం పర్యటించారు. వారికి గ్రామస్తులు పూల బోకేతో స్వాగతం పలికారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం వెంకటేష్ నేత అన్న కుమారుడైన చరణ్ తేజ్ వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో హైకోర్టు మాజీ జీపీ రాజేష్ నేత, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్, చిందం చంద్రయ్య, వెంకటస్వామి, జాడి రాజన్న జునుగురి మల్లయ్య, చిందం శ్రీనివాస్, దేవ రాజశేఖర్, జాడి సుధాకర్ పాల్గొన్నారు.

అమ్మ ఒడి ఎన్‌జీఓ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలో అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్ట్, టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో ప్రతి ఆదివారం నిర్విరామంగా కొనసాగే ఈ అన్నదాన కార్యక్రమం కొనసాగింపుగా బెల్లంపల్లి పట్టణంలో కాంట చౌరస్తా బస్టాండ్ వద్ద నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో యాచకులు, నిరుపేదలు, కూలీలు, బాటసారులకు, ప్రయాణికులు పాల్గొన్నారు. అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్టు వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్, టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్ మాట్లాడుతూ అమ్మఒడి అన్నదాత ప్రాజెక్టులో భాగంగా 227వ వారల సందర్భంగా అన్నదాన కార్యక్రమం విజయవంతంగా సాగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, నారాయణ, గన్నవరం తిరుమలచారి, సిద్ధమల్ల రఘు, బొమ్మకంటి బాలకృష్ణ, అనీల్, పృథ్వి అజయ్, యూసుఫ్, చెందుపట్ల లింగమూర్తి, పాల్గొన్నారు.

చలి పులి..!




- ఉమ్మడి జిల్లాను వణికిస్తున్న చలి తీవ్రత
- ఉదయం..సాయంత్రం వేళలో పొగ మంచు
- రాష్ట్రంలో జిల్లాలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు
- మరింత ఇబ్బందులు పడుతున్న ఏజెన్సీ వాసులు
- జాగ్రత్తలు తీసుకోవడమే మేలంటున్న నిపుణులు

ఉమ్మడి జిల్లాను చలి తీవ్రత గజగజ వణికిస్తోంది. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సీజన్‌లోనూ దాని ప్రభావాన్ని చూపిస్తోంది. వారం రోజుల క్రితం తుఫాను కారణంగా శీతలగాలులు, చిరుజల్లులతో ఇబ్బందులు పడిన జనాలకు తాజాగా పెరిగిన చలి తీవ్రత మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఈ వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతుండటంతో చలి తీవ్రత మరింత అధికమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉండటంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న జనాలతో పాటు మూగజీవాలు సైతం తట్టుకోలేకపోతున్నాయి. తాజాగా కుమురంభీం జిల్లా తిర్యాణిలో ఉష్ణోగ్రతలు 9డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడం.. ఏజెన్సీ ప్రాంతంలో చలి విజృంభిస్తున్న తీరును తెలియజేస్తోంది. రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం..సాయంత్రం వేళలో పొగ మంచు కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేకువ జామున పనులకు వెళ్లే వారు గజగజ వణుకుతూ విధులకు వెళ్లాల్సి వస్తోంది.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే భిన్నమైన వాతావరణానికి నెలవుగా ఉంటుంది. ఇక్కడ మూడు కాలాలు వాటి ప్రభావాన్ని చూపిస్తుంటాయి. రాష్ట్రంలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం..అత్యధిక వర్షపాతంతో పాటు చలి తీవ్రత కూడా అధికంగానే నమోదు కావడం ప్రత్యేకతగా చెప్పుకొంటారు. తాజాగా రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కావడం విశేషంగా మారింది. ఏటా మాదిరిగానే ఈ నెల రెండో వారం నుంచి జనవరి మొదటి వరకు చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కుమురంభీం జిల్లా తిర్యాణి మండలంలో 9డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జనాలు చలితీవ్రతకు గజగజ వణుకుతున్నారు. ఉదయం, రాత్రి వేళలో చలి మంటలు కాగుతూ రక్షణ పొందుతున్నారు. వారం రోజుల క్రితం మిగ్‌జాం తుఫాను కారణంగా శీతలగాలులు వీయడం, చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లగా మారింది. రెండు, మూడు రోజులు సూర్యుడి జాడ కనిపించలేదు. క్రమంగా తుఫాను ప్రభావం వెళ్లిపోగానే చలి తీవ్రత ప్రారంభమైంది. కిందటేడాది డిసెంబర్,జనవరి నెలల్లో 6డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జనాలు చలి తీవ్రతను తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరయ్యారు. తాజాగా ఈ సంవత్సరం సైతం కిందటేడాది పరిస్థితి పునరావృతమయ్యే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. చలి నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు తీసుకోవడమే మేలని సూచిస్తున్నారు.



చలి మంటలతో రక్షణ..!

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం 9డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పడిపోగా..మైదాన ప్రాంతాల్లో 10 నుంచి 11డిగ్రీల వరకు నమోదవుతోంది. దీంతో వేకువ జాము నుంచే పల్లెల్లో చలి మంటలు కనిపిస్తున్నాయి. రాత్రివేళలో సైతం ఉన్ని దుస్తులు ధరించి చలి మంటలతో రక్షణ పొందుతున్నారు. మరోపక్క ఈ చలి తీవ్రత కారణంగా వృద్దులు, చిన్నారులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు అనారోగ్యానికి గురవుతున్నారు. చిరువ్యాపారులు, పాల వ్యాపారులు, పారిశుధ్య కార్మికులు, ఉదయం వేళలో విధులకు వెళ్లేవారు వెచ్చని దుస్తులు ధరించి చలి నుంచి రక్షణ పొందుతూ పనులు చేసుకోవాల్సి వస్తోంది. ఇక మూగజీవాలు సైతం చలి తీవ్రతను తట్టుకోలేకపోతున్నాయి. కొందరు రైతులు వాటిపై వెచ్చని దుస్తులు కప్పి రక్షణ కల్పిస్తున్నారు. చాలా మంది ఉదయం, రాత్రి వేళలో ఇంట్లో నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. అత్యవసర పనులు ఉన్న వారు మాత్రమే తప్పనిసరి పరిస్థితిలో వెళ్లాల్సి వస్తోంది. జిల్లాలో చలి తీవ్రత కారణంగా వృద్దులు, చిన్నారులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మరింత పెరిగే అవకాశం

శ్రీధర్‌చౌహాన్, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం



ప్రతి ఏటా మాదిరిగానే డిసెంబర్ రెండో వారం నుంచి జిల్లాలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. మరో రెండు, మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉంటుంది. జనవరి మొదటి వారం వరకు ఈ చలి ప్రభావం ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలో మరింత అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. చలి రక్షణ పొందేందుకు ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.

బీసీ ఎజెండా కోసం ఉద్యమించాలి

- మంచిర్యాలలో బీసీ భవన్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లాలోని బీసీ వర్గ ప్రజల ఆకాంక్షల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని బీసీ సంఘాల నాయకులు ప్రకటించారు. మంచిర్యాలలో ఆదివారం బీసీ ఐక్యవేదిక జిల్లా కార్యాలయం 'బీసీ భవన్' ప్రారంభోత్సవ సభలో వారు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీసీ జన గణన చేపట్టేలా దేశవ్యాప్తంగా ఉన్న బీసీలు ఉద్యమిస్తున్నారని, మంచిర్యాల జిల్లాలోనూ బీసీ వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించి బీసీ జనగణనను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. మండల్ కమిషన్ సిఫార్సులు పూర్తిగా అమలు చేసి బీసీల సంక్షేమానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ రాజ్యాధికారాన్ని సాధించే చైతన్యం జిల్లాలోని ప్రజలలో రావాలని వారు పిలుపునిచ్చారు. బీసీ ఉద్యమ మార్గదర్శులు మహాత్మ పూలే, సాహు మహరాజ్, మండల్ చూపిన బాటలో ఆత్మాభిమాన ఉద్యమాన్ని బీసీలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో పూలే విగ్రహాన్ని సాధించుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్, బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, అఖిల గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు పున్నం, కురుమ సంఘం జిల్లా నాయకులు సమ్ము రాజన్న, సింగరేణి ఐక్యవేదిక నాయకులు గురిజాల రవీందర్ రావు, పెద్దపల్లి కోటిలింగం, బీసీ నాయకులు మొగిళి తిరుపతి, నలంద సాగర్, సోమయ్య, ఆడిచర్ల సాగర్, భూమన్న, అఖిల్ పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ సమస్యను పరిష్కరించండి

- మంత్రి ఉత్తమ్ కుమర్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వివేక్



నవతెలంగాణ-జైపూర్

గోదావరి తీర ప్రాంతాన్ని ముంచెత్తుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ సమస్యను యుద్ధ ప్రాతిపధికన పరిష్కరించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామి కోరారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమర్ రెడ్డిని ఆదివారం సెక్రటేరియోట్‌లో కలిసి కాళేశ్వరం బ్యాక్ వాటర్ సమస్యను వివరించారు. ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి గోదావరి తీర ప్రాంతానికి ముంపు ముప్పు ఏర్పడిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో మంచిర్యాల, పెద్దపల్లి, భూపాల్‌పల్లి జిల్లాల పరిధిలో గోదావరి తీర ప్రాంతంతో పంటలు సాగు చేయడం సమస్యగా మారిందని వివరించారు. యుద్ధ ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరడంతో స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌ను పిలిచి బ్యాక్ వాటర్ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, పనుల నిర్వాహణకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించినట్టు వివేక్ వెంకటస్వామి తెలిపారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న



నవతెలంగాణ-జన్నారం

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరులతో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి పదోన్నతులు ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జీఓ 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, స్వంత జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్టానికి రెండవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్ రెడ్డికి తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత గత పది సంవత్సరాలుగా విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, విద్యారంగం పటిష్టానికై నూతన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి ఉపాధ్యాయుల నియామకాలపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని, విద్యారంగ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రతి మండలానికి కేజీ నుండి 10వ తరగతి వరకు అన్ని వసతులు కల్పించి ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భాధవత్ ప్రకాష్ నాయక్, జిల్లా బాధ్యులు వినోద్ పాల్గొన్నారు.

నేడే వాహనాల వేలం

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో సోమవారం వాహనాల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ దీపక్ తెలిపారు. స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన 12 ద్విచక్ర వాహనాలకు ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు వాహన విలువలో 50 శాతం ఈఎండీ చెల్లించాలని సూచించారు.

ఎకో టూరిజంపై అటవీ అధికారులకు అవగాహన



నవతెలంగాణ-జన్నారం

జన్నారం కవ్వాల్ టైగర్ జోన్‌లోని అటవీ అధికారులకు ఎకో టూరిజంపై అవగాహన కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని టీడీసీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. మహారాష్ట్రలోని యావత్మాల్‌కు చెందిన వైల్డ్ లైఫ్ వార్డెన్, డాక్టర్ రంజాన్ వరాని, ఎకో టూరిజం ఎలా అభివృద్ధి చేయాలి, టూరిస్టులకు ఎలాంటి సదుపాయాలు కల్పించాలి అనే అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. టూరిస్టులకు అన్ని రకాల సదుపాయాలు ఉంటేనే, ఎక్కువ మంది ఆ ప్రదేశాన్ని చూడటానికి వస్తారన్నారు. ఎఫ్ఎస్ఓలు ఎఫ్‌బీఓలు, ఎఫ్ఆర్ఓలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కలిసిన పుట్టిగూడ గ్రామస్తులు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామమైన పుట్టిగూడ గ్రామానికి చెందిన పలువురు ఆదివారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ ఆంక్షల వలన ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్రం శ్రీనివాస్, ఆత్రం సంతోష్, మండడి జంగు, ఆత్రం తిరుపతి, కొట్నక రాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | డిసెంబర్ 18, 2023 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామానికి చెందిన ఆకు లక్ష్మీ రాజేశ్వర్‌ల కుమారుడు రిషి(12) ఇటీవల బ్రెయిన్ ట్యూమర్‌తో మరణించాడు. కాగా నర్సాపూర్ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మిత్ర బృందం సభ్యులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఎన్ఆర్ఐ సభ్యులు ఉదయ్ కిరణ్, దర్శనం శేఖర్, వన్నెల శేఖర్ ఉన్నారు.



అక్రమ పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలో అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం దాడులు నిర్వహించి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఆరు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సాయికుమార్ తెలిపారు. షేక్ సమైర్‌పై కేసు నమోదు చేసి బియ్యన్ని పౌరసరఫరాల అధికారులకు అప్పగించామన్నారు. అక్రమంగా రేషన్ బియ్యన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆ పల్లె.. అభివృద్ధి ముల్లె..!

- పంచాయతీగా ఆవిర్భావంతో సమూల మార్పులు
- కొత్తరూపు సంతరించుకున్న రంగశివిని



నవతెలంగాణ-కుభీర్

మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న కుగ్రామం రంగశివిని ఆ గ్రామ ప్రజలు అభివృద్ధికి, విద్య, వైద్యంలో అమడ దూరంలో ఉన్నారు. కనీస సౌకర్యాలైనా అంతర్గత రోడ్లు, మురికి కాలువలు లేకపోవడంతో పాటు పరిశుధ్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అదేవిధంగా రోడ్డు సౌకర్యం సుదూర ప్రాంతాలకు వెళ్ల లేక విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించలేక చదువులు మానేసి ఇతర పనులు చేసుకునేవారు. ఆ గ్రామంలో 160 కుటుంబాలు, 1700 జనాభా, 6వందల ఓటర్లు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 5వందల జనాభా కలిగిన తండాలను, గొండు గూడాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. దీంతో అభివృద్ధికి అమడ దూరంలో ఉన్న రంగశివిని గ్రామపంచాయతీగా ఏర్పడటంతో కొత్తరూపు రేఖలు సంతరించుకున్నాయి. రంగశివిని ప్రజలు సర్పంచ్‌గా కదం దత్తురాం పటేల్‌ను గెలిపించారు. సర్పంచ్ గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామాభివృద్ధికి బాటలు వేశారు.

గ్రామపంచాయతీగా ఏర్పాటుతో సమూల మార్పులు...

కుభీర్ మండలం మారుమూల గ్రామమైన రంగశివిని గ్రామపంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి గ్రామస్తుల సహకారంతో సర్పంచ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముందుకెళ్లారు. గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణంతో పాటు మురికి కాలువల నిర్మాణం చేపట్టారు. అదేవిధంగా పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నారు.

కొత్తరూపు సంతరించుకున్న రంగశివిని..

గ్రామపంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి రంగశివిని అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది. మండలంలోని మిగతా గ్రామాల కంటే భిన్న మార్పులు తీసుకువచ్చారు. అక్కడి అభివృద్ధిని చూసి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్పంచ్ అవార్డులు అందుకున్నారు. అదే విధంగా నియోజకవర్గంలోనే మొట్టమొదటగా నూతన గ్రామ పంచాయతీకి భవన నిర్మాణానికి రూ.20లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. గ్రామాభివృద్ధి సర్పంచ్ కదం దత్తురాం పటేల్ పంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా అందజేశారు. దీంతో పంచాయతీ భవన నిర్మాణం చేపట్టి ప్రారంభించుకున్నారు. విరి అభివృద్ధిని చూసి ప్రభుత్వం అవార్డులను ప్రదానం చేసింది.



గ్రామస్తుల సహకారంతోనే అభివృద్ధి



రంగశివిని నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీ అయినప్పటికీ గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగింది. అదేవిధంగా ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేశాం. ఎప్పటికప్పుడు పారిశుధ్య ప్రాధాన్యతను ఇస్తూ గ్రామాన్ని అందరం కలిసి అభివృద్ధి చేసుకున్నాం.

దత్తురాం పటేల్, సర్పంచ్ రంగశివిని

గ్రామపంచాయతీ ఏర్పడటంతోనే అభివృద్ధి



మా గ్రామం గతంలో వేరే గ్రామ పంచాయతీలో ఉండేది. అప్పుడు మా గ్రామానికి ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామంలో సమస్యలు చాలా వరకు ఉండేవి. గ్రామపంచాయతీగా ఎప్పుడు ఏర్పడిందో అప్పటి నుంచి గ్రామానికి నిధులు రావడం జరిగింది. దీంతో గ్రామాన్ని సర్పంచ్‌కి సహకారం అందించి సమిష్టిగా కలిసి అభివృద్ధి చేసుకున్నాం.

సంపంగి వెంకటి, గ్రామస్తుడు రంగశివిని

సిలిండర్ పేలి మహిళా సజీవ దహనం



నవతెలంగాణ-భైంసా

మండలంలోని కామోల్ గ్రామంలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామోల్ గ్రామంలోని ఓ ఇంట్లో సిలిండర్ పేలి మహిళా సజీవ దహనమైంది. గ్రామానికి చెందిన గుమ్మల దృపతబాయి(55) అనే వివాహిత ఇంట్లో ఒక్కరే ఉండగా ఈ దుర్ఘటన చేసుకుంది. ఆ సమయంలో ఆమె భర్త బయట ఉండటం, పెద్ద మొత్తంలో మంటలు చెలరేగడంతో ఆమె అగ్నికి అహుతై కాలి బూడిదైంది. రేకుల షెడ్డు కావడం, చుట్టుపక్కల వారు మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీంతో గ్రామంలో తీరని విషాదఛాయలు అలుముకున్నాయి. బయటకు వెళ్లిన భర్త ఇంటికొచ్చి చూసేసరికి భార్య కాలిబూడిదవడంతో ఆ హృదయ విదారక సంఘటనను చూసి ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు. భైంసా రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే...

కామోల్‌లో జరిగిన సంఘటన తెలుసుకొని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వపరంగ ఆదుకుంటామని తెలిపారు.

ముస్తాబవుతున్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుంది. పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల ఈ కార్యాలయాన్ని అన్ని హంగులతో అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే జోగు రామన్న ఈ కార్యాలయం నుంచి అధికారిక కార్యకలాపాలు నిర్వహించారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయనపై బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పాయల్ శంకర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన సంగతి తెల్సిందే. ఈ మేరకు నూతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అధికారిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా కార్యాలయాన్ని సిద్ధం చేస్తున్నారు. భవనానికి నూతనంగా రంగులు హద్దు కొత్త కళను తీసుకువచ్చారు. కార్యాలయంలో కొత్త సామాగ్రిని సమకూర్చుతున్నారు. రెండు, మూడు రోజుల్లో ఆయన శాస్త్రోక్తతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి క్యాంపు కార్యాలయానికి రానున్న నేపథ్యంలో ముస్తాబు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

19న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-లోకేశ్వరం

ఈ నెల 19న మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానికి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లలిత భోజన్న అధ్యక్షతన ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సల్మాన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, తమ నివేదికలు తీసుకొని సమావేశానికి హాజరు కావాలని కోరారు.

కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

రోడ్డు ప్రమాదంలో మరణించిన కుచులపూర్‌కు చెందిన రాములు కుటుంబాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుంటు ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు మాజీ ఎంపీ నగేష్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలున్నారు.

అక్రమ మొరం తవ్వకాలు పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-కుభీర్

అక్రమ మొరం తవ్వకాలు మండలంలో జోరుగా సాగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. చెరువులు, గుట్టలు, ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరుపుతున్నారు. ప్రశ్నించేవారు లేకపోవడంతో అక్రమార్కుల వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. మండలంలోని హల్దా గ్రామ సమీపంలోని ఉన్న చెరువులో అనుమతులు లేకుండా జరుపుతున్నట్టు పలువురు పేర్కొంటున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నిఘా ఏర్పటు చేసి అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కులపై వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రుణమాఫీ మాటాలకే పరిమితం

- ఆరు గ్యారంటిలో రెండే అమలు.. మిగిత వాటి సంగతేంటి..?
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

నవతెలంగాణ-తలమడుగు

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ డిసెంబర్ 9వ తేదిన రైతులకు రూ. రెండు లక్షల రుణామాఫీ చేస్తామని ప్రకటించి ఇప్పటి వరకు చేయలేదని, రుణమాఫీ కేవలం మాటాలకే పరిమితం అయిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ఎద్దేవ చేశారు. ఆదివారం మండలంలోని ఝురి గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మీ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ మంత్రి గోడం నగేష్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డిలను గ్రామస్థులు సత్కరించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని ప్రకటించిందన్నారు. వారం గడుస్తున్న ఇప్పటి వరకు చప్పుడు లేదన్నారు. ఆరు గ్యారంటిల్లో రెండింటినే అమలు చేశారని, మిగిత నాలుగు గ్యారంటిల గురించి ప్రస్తవించలేదన్నారు. ఇచ్చిన మాటలను కాంగ్రెస్ నిలబెట్టుకుంటు ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మండల ప్రజలు అత్యధిక ఓట్లతో గెలిపించినందుకు అన్ని వర్గాల ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. గ్రామస్తులు సమస్యలను విన్నవించారని వాటిని పరిష్కరించేల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మెన్ ప్రహ్లాద్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, పార్టీ నాయకులు వసంత్ రెడ్డి, కేదారేశ్వర రెడ్డి, గంగాధర్, బొచ్చన్న, ప్రమోద్, శ్రీనివాస్ రెడ్డి, రమాకాంత్, ఆసం రవి, కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ ఎల్లమ్మ శ్రీనివాస్ రెడ్డి, నగేష్, జనక్ రంబాయి, పల్లవి ప్రభాకర్, చంద్రకాంత్, పెందూరు మాధవరావు, వామన్, రంజిత్ రెడ్డి, అభిరామిరెడ్డి, వామన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

గ్రామీణ క్రీడాకారులు కబడ్డీలో రాణించాలి



నవతెలంగాణ-తలమడుగు

గ్రామీణ క్రీడాకారులు కబడ్డీలో రాణించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని పల్సి(కె) గ్రామంలో కబడ్డీ పోటీలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. క్రీడకారులను పరిచయం చేసుకుంటూ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామం పల్సి(కె)లో ప్రతి సంవత్సరం కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడ స్ఫూర్తిని చాటేల పాల్గొనాలని సూచించారు. క్రీడాల వల్ల ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణగా ఉంటారన్నారు. మరుగున పడుతున్న క్రీడలను గిరిజన గ్రామాల్లో పోటీలు నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నగేష్, డీసీసీబీ అధ్యక్షులు అడ్డి బోజారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మెన్ ప్రహ్లాద్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, సర్పంచ్ పాయల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేకల రవికాంత్, కేదారేశ్వర రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ ఎల్లమ్మ శ్రీనివాస్ రెడ్డి, ప్రీతం రెడ్డి, అభిరామ్ రెడ్డి, గంగాధర్, నరసింహులు, వసంత్ రెడ్డి, రమాకాంత్, రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

అయోమయంలో ఆయకట్టు రైతాంగం



నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగానికి రెండో పంటకు సాగునీటి విడుదలపై అధికారులు, రైతులకు స్పష్టత ఇవ్వకపోవడంతో ఆయకట్టు రైతాంగం అయోమయంలో పడ్డారు. కడెం ప్రాజెక్టు నీటి సామర్థ్యం డెడ్ స్టోరేజీకి చేరువలో ఉండటంతో రెండో పంట సాగుకు నీటి విడుదల చేస్తారో చేయరో అని రైతులు పొలాలను దున్ని అధికారుల స్పష్టత కొరకు ఎదురుచూస్తున్నారు.

కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 700 ఫీట్స్ 7.603 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 683.675 ఫీట్స్ 4.077 టీఎంసీలలో నీటి నిలువ కొనసాగుతుంది. అయితే ప్రాజెక్టు డెడ్ స్టోరేజ్ లెవెల్ 675 ఫీట్స్ 2.8 టీఎంసీలు కావడంతో రైతుల పంట పొలాలకు ఈ యాసంగి సాగులో నీటి విడుదల ఇవ్వడం కష్టమేనని అధికారులు తెలుపుతున్నారు. అయితే కడెం ప్రాజెక్టుకు గత వర్షాకాలం వరదలకు ప్రాజెక్టు వరద గేట్లతో సహా కౌంటర్ వెట్లు, రోలర్లు, బేరింగ్లు, రోపుల సమస్యలు తలెత్తి లెఫ్ట్ కెనాల్ వద్ద కట్ట కోతకు గురైంది. అయితే ప్రస్తుత ఈ యాసంగి సీజన్‌లోనైన ప్రాజెక్టు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి, కడెం ఆయకట్టు రైతాంగానికి వచ్చే ఏడాది నుండైనా రెండు పంటలకు సాగునీటిని విడుదల చేయాలని ఆయకట్ట రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై ప్రాజెక్టు అధికారులు సంబంధిత ప్రాజెక్టు సమస్యలపై ఎస్టిమేట్ చేసి పంపడం జరిగిందని పైనుండి వర్క్ సాంక్షన్ అయి టెండర్ అయితే పనులు మొదలు పెడతామని అధికారులు తెలుపుతున్నారు.

ఈ యాసంగికి నీరందించలేం..



కడెం ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి కానందున ఈ యాసంగికి సాగునీరందించలేం. ఈ యాసంగిలో మరమ్మతులు చేపట్టి వచ్చే ఖరీఫ్, రబీ పంటలకు నీరందిస్తాం.

డీఈ బోజదాస్

మరమ్మతులు చేపట్టి సాగునీరందించాలి

కడెం ప్రాజెక్టు మరమ్మత్తు పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో 68వేల ఎకరాల ఆయకట్టు రైతులు నష్టపోయారు. సరైన సమయంలో మరమ్మతులు చేపడితే యాసంగి పంటలకు సాగు నీరందేది. ఇప్పటికైనా ప్రభుత్వం మరమ్మతులు చేపట్టి సాగునీరందించాలి.

పాక అంజన్న రైతు



ఆయకట్టు రైతులను ఆదుకోవాలి

గత రెండు సంవత్సరాలుగా వర్షాకాలంలో వచ్చే వరద నీటిని తట్టుకోలేక ప్రాజెక్టులో అనేక సమస్యలు వస్తున్నా, ప్రాజెక్టు సమస్యలను పరిష్కరించడంలో అధికారులు గత ప్రభుత్వం విఫలమైంది. వర్షాకాలం రాగానే ప్రాజెక్ట్ ఎప్పుడు తెగిపోతుందో అన్న భయంతో మండల ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టు మరమ్మత్తుల పనులను పూర్తిస్థాయిలో నిర్వహించి, 68 వేల ఎకరాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా అధికారులు కృషి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి.

కొప్పుల రవి యువరైతు



నవతెలంగాణ

3

కుమురంభీం ఆసిఫాబాద్

సోమవారం | డిసెంబర్ 18, 2023 | www.navatelangana.com

బండి సంజయ్‌ని కలిసిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌ని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ మర్యాద పూర్వకంగా కలిశారు. సిర్పూర్‌లో బండి సంజయ్ బహిరంగ సభతో పాటూ ఇరత అగ్ర శ్రేణి నేతల సభలతో సిర్పూర్ బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపారని ఎమ్మెల్యే హరీష్ తెలిపారు. రాబోయో రోజుల్లో బీజేపీ నాయకత్వంలో సిర్పూర్ సర్వతోముఖాభివృద్ధికి పాటు పడతానని ఎమ్మెల్యే హరీష్ వివరించారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యేగా పాల్వాయి హరీష్ బాబు గెలుపొందడం పట్ల శాలువాతో ఎమ్మెల్యే హరీష్‌ను బండిసంజయ్ సత్కరించారు.

ప్రారంభమైన శివమల్లన్న షష్టి బోనాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో ఆదివారం నుంచి షష్టిబోనాలు ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే భక్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకుని కొత్త బియ్యం నైవేద్యాన్ని స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగజ్‌నగర్ మండలంతో పాటు ఆసిఫాబాద్, మంచిర్యాల, బెల్లంపల్లి తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ ఆలయానికి అధికసంఖ్యలో వచ్చి ఇక్కడ నైవేద్యాన్ని వండి స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ వేణుగోపాల్ గుప్తా ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

సాహసం కోసం.. కావాలి సహాయం..!

- శిఖరాలను అవలీలగా ఎక్కుతున్న కార్తీక్
- కిలిమంజారో.. ఎవరెస్టు అధిరోహణకు సన్నద్ధం
- ఆర్థిక సాయం కోసం గిరిజన యువకుడి తాపత్రయం

నవతెలంగాణ-కెరమెరి

లక్ష్యం పెద్దగా ఉన్నప్పుడే ఆశయ సాధన సాధ్యమవుతుందని ఓ మహానుభావుడు చెప్పిన మాటలను ఆదర్శంగా తీసుకొని చిన్ననాడే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలని నిర్ణయించుకొని ఆ దిశగా మండలంలోని కేళికే గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్ అడుగులు వేస్తున్నాడు. ఓవైపు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నప్పటికీ లక్ష్యం ముందు అవి చిన్నబోయేలా చేయడమే తన ఆశయమని, ఎవరైనా ఆర్థిక సహాయం చేస్తే రాష్ట్రం పేరు నిలబెడతానని కార్తీక్ చెప్తున్నాడు.

గిత్తే కార్తీక్ నేపథ్యం

చిన్ననాటి నుండి పేదరికంతో మగ్గిన కార్తీక్ తండ్రి రుక్మాజీ, తల్లి రావుబాయి. మండలంలోని కేళికే చంద్రశేఖర్ గ్రామంలో ఉంటూ మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో సీటు సంపాదించి ఆసిఫాబాద్‌లో పదో తరగతి వరకు చదివు పూర్తి చేశాడు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ మంచిర్యాల జిల్లా చెన్నూరులోని మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. చిన్ననాటి నుండి గిరిజన ప్రాంతాల్లో పెరగడంతో కొండలు ఎక్కడంపై ఆసక్తి పెరిగి 13వ ఏటనే పర్వతారోహణ చేసిన నిజామాబాద్‌కు చెందిన మాలావత్ పూర్ణిమను ఆదర్శంగా తీసుకొని ఎవరెస్ట్ ఎక్కడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు.

ఎవరెస్ట్ ఎక్కడమే లక్ష్యం

ఎత్తైన శిఖరాలు ఎక్కాలంటే ప్రత్యేక శిక్షణ అవసరం దీనికోసం ఇప్పటికే సెప్టెంబర్ 18 నుండి అక్టోబర్ 16 వరకు సిక్కింలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. బోనగిరి గుట్టపై 150 ఫీట్ల రాఫెల్లింగ్ 150 ఫీట్ల క్లైంబింగ్‌తో పాటు 650 ఫీట్ల ట్రెక్కింగ్ పూర్తి చేసి బోనగిరి రాక్ లైన్ స్కూల్ ఆధ్వర్యంలో సిక్కిం శిక్షణకు ఎంపికై ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్, ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, వంజారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటముండేలు చేసిన ఆర్థిక సాయంతో శిక్షణ పూర్తి చేశాడు.







జనవరిలో కిలిమంజారో.. మార్చిలో కాంచన గంగ

గత సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 19వ తేదీ వరకు దాదాపు నెల రోజులపాటు సిక్కిం రాష్ట్రంలో పర్వతారోహణకు సంబంధించినటువంటి ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఈ శిక్షణలో వివిధ రాష్ట్రాల నుంచి 30 మంది హాజరయ్యారు. వీరిలో గిత్తే కార్తీక్ తన ప్రతిభను చాటుకున్నారు. ఏ గ్రేడ్ స్కోరు సాధించారు. వచ్చే జనవరిలో అంతర్జాతీయ స్థాయిలో 7వ అతి పెద్ద శిఖరమైనటువంటి దక్షిణ ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతరోహణకు ఎంపికయ్యారు. ఈ ఈవెంట్లో పాల్గొనేందుకు సుమారు రూ.18 లక్షలు ఖర్చుకానున్నట్లు తెలిపారు. మన దేశంలోని కాంచనగంగా పర్వతరోహణ మార్చిలో నెలలో ఉంది. ఈ పర్వతారోహణకు రూ.5 లక్షలు అవసరమున్నట్టు పేర్కొన్నారు.

ఆర్థిక సహాయం కోసం ఎదురుచూపులు

ఇంతవరకు పలువురు చేసిన ఆర్థిక సాయంతో అనేక ఫీట్లు సొంతం చేసుకున్న కార్తీక్ రానున్న జనవరి, మార్చి, నెలలో కిలిమంజారో, కాంచన గంగ అధిరోహణకు పరికరాలతో పాటు ఇతర ఖర్చులకు రూ.21 లక్షలు కావడంతో ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో అనేకమంది సాయం చేయడంతో ఈ స్థాయి వరకు వచ్చానని తెలిపాడు. దాతలు ఎవరైనా సహకరిస్తే తన లక్ష్యం నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- జడ్పీటీసీ అరిగేల నాగేశ్వరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగేల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జిల్లా అధ్యక్షుడు కర్ణగౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పెన్షనర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌ని సక్రమంగా అందేలా చూస్తానన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఇటీవల పదవి విరమణ చెందిన ఉద్యోగస్తులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సుభాష్, శంకర్, వెంకన్న, అచ్యుత్ రావు పాల్గొన్నారు.

జిల్లాలో నెట్ బాల్ అభివృద్ధికి చర్యలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నెట్ బాల్ క్రీడ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన నెట్ బాల్ జిల్లా జూనియర్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెట్ బాల్ అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం జిల్లా సెక్రెటరీ తిరుపతి మాట్లాడుతూ నెట్ బాల్ పోటీలకు 50 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. దీనిలో బాలుర విభాగంలో ట్రెడిషనల్ విభాగంలో 12, ఫాస్ట్ విభాగంలో ఐదుగురిని బాలికల విభాగంలో కూడా అదేవిధంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 30 వచ్చేనెల ఒకటి రెండు రోజులపాటు నల్గొండ జిల్లా జోసఫ్ హై స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచులు హరీష్, ఏడుకొండలు, రాకేష్, పీడీ లక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు 'ఆదర్శ' విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు ఎనిమిదో తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన జోనల్ స్థాయి చెస్ పోటీల్లో అండర్-14 విభాగంలో ఎస్.మీనాక్షి జోనల్ స్థాయి ద్వితీయ స్థానం రాగా, దుర్గం దివ్య జోనల్ స్థాయి తృతీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గత వారం నిర్వహించిన అండర్-19 చెస్ పోటీల్లో ఇంటర్ విద్యార్థులు దుర్గం విద్య పి.స్ఫూర్తి ఎంపికయ్యారన్నారు. చెస్ పోటీల్లో పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడం పట్ల ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ సాంబశివరావు, పీడీ బి.తిరుపతి, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్ కుమార్ అభినందించారు.

మల్లన్న షష్టి బోనాలు ప్రారంభం

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని గోపాల్‌నగర్ గుట్ట మల్లన్న ద్వారకాపూర్ మల్లన్న గుడి వద్ద షష్టి మల్లన్న బోనాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మండల పరిసర ప్రాంతాల్లోని ప్రజలు మల్లన్న గుట్ట వద్ద బోనాలు సమర్పించారు. ప్రతి ఏటా జరిగే ఉత్సవాలల్లో బోనాలు తులాభారాలు అన్న సత్రాలు ఒగ్గు కథల వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. పంట దిగు బడులు వస్తున్న నేపథ్యంలో రైతులు కొత్త బియ్యంతో తయారుచేసిన నైవేద్యంతో పాటు వంకాయ చిక్కుడు అనుప, సొర, టమాట కూరగాయలతో చేసిన ప్రత్యేక వంటకాలను మల్లన్నకు సమర్పిస్తారు. పాల దిగుబడులు అధికంగా వచ్చే షష్టి మాసంలో పాలు పెరుగు వెన్న నెయ్యితో చేసిన ప్రత్యేక పదార్థాలను మల్లన్నకు సమర్పిస్తారు.

సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరిని జయప్రదం చేయండి

- జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 25వ తేదీన జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో సీపీఐ(ఎం) జిల్లా విస్తత స్థాయి సమావేశం విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ అన్నారు. ప్లీనరీ కరపత్రాలను స్థానిక జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లీనరీ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా ఇంచార్జి బండారు రవి కుమార్ హాజరవుతున్నారన్నారు. జిల్లాలో పార్టీ అనేక ప్రజా పోరాటాలు నిర్వహించిందని అన్నారు. జిల్లాలో ప్రాజెక్టులను మరమ్మతులు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ రాష్ట నాయకత్వంతో సందర్శించిందని గుర్తు చేశారు. అంతే కాకుండా జిల్లాలో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని పోరాడిందని గుర్తు చేశారు. జిల్లా స్థాయి అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లాలో పోడుభూముల సమస్యల మీద పోరాటం చేసిందన్నారు. గిరి గ్రామాలలో రోడ్డు విద్య వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరిందన్నారు. జిల్లాలో భవిషత్తు ప్రజా పోరాటాలు నిర్వహించడానికి జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహిస్తుందని, ప్లీనరీ సమావేశాలకు జిల్లాలోని పార్టీ సభ్యులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తిక్, రాజేందర్, దుర్గం రాజ్ కుమార్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వివాహిత నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

భర్తకు, పిల్లలకు దూరంగా ఉంటున్న ఓ వివాహిత నాకు పెళ్లికాలేదని బుకాయించి ఓ యువకున్ని ప్రేమించింది. సదరు వివాహితకు గతంలోనే పెళ్లి జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నట్టు తెలియడంతో ఆమెకు దూరమయ్యాడు సదరు యువకుడు. ఇరువర్గాల పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి వేర్వేరుగానే దూరంగా ఉండాలని తీర్మాణించి పత్రాలు రాయించినట్టు యువకుని తల్లిదండ్రులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే ఆసిఫాబాద్‌కు చెందిన రాణి (37) అనే వివాహిత ఏడాది కాలంగా భర్తకు, పిల్లలకు దూరంగా ఉంటుంది. కాగజ్‌నగర్ మండలం ఈజ్ గాంకు చెందిన రాంటెంకి సాయి(22) ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఆసిఫాబాద్‌లోని ఓ శుభ కార్యానికి ఫోటోగ్రాఫర్‌గా వెళ్లగా రాణితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఆర్నెళ్ల తర్వాత ఈమెకు భర్త, పిల్లలు ఉన్నారని తెలియడంతో సాయి దూరంగా ఉంటున్నారు. 10 రోజులు కిందట ఇరువర్గాల పెద్దలు పంచాయతీ నిర్వహించారు. రాణి, సాయిలు వేర్వేరుగా ఉండడానికి పెద్దలు నిర్ణయం తీసుకొని పత్రాలు రాయించారు. ఈ సమస్య ఎదురు కావడంతో సాయి, తల్లిదండ్రులు రమాదేవి, దేవన్నలు మకాం మార్చి కాగజ్‌నగర్‌లో ఉంటున్నారు. అదివారం సాయి ఇంటికి వచ్చిన రాణి ఇంటి ముందు నిరసన వ్యక్తం చేసింది.

స్వర్గ రథం వితరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2003-04 పదవ తరగతి పూర్వ విద్యార్థులు గ్రామానికి స్వర్గ రథాన్ని వితరణ చేశారు. గ్రామంలో స్వర్గరథం లేని విషయం గమనించి గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బంధులను గుర్తించి స్వంత డబ్బులతో స్వర్గరథాన్ని చేయించి గ్రామాభివృద్ధి కమిటీకి అందించారు. ఈ మేరకు ఆదివారం పూజా కార్యక్రమాలను నిర్వహించి స్వర్గరథాన్ని గ్రామ అభివృద్ధి కమిటీకి అప్పగించారు. గ్రామస్థులందరు ఉచితంగా స్వర్గ రథాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఇతమంచి నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలోని యువకులందరు ఈ బ్యాచ్‌ని స్ఫూర్తిగా తీసుకుని మంచి మంచి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లౌడియా వసంత్, నోముల నరేందర్, సంధుల గంగారాం, లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే సులువుగా ఉన్నత శిఖరాలు

- తిరువళ్లూర్ అసిస్టెంట్ ఎస్పీ వివేకానంద శుక్లా
- నవోదయలో అలరించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తమిళనాడులోని తిరువళ్లూర్ అసిస్టెంట్ ఎస్పీ వివేకానంద శుక్లా అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వివిధ రాష్ట్రాలలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేకానంద శుక్లాను విద్యాలయం అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. నవోదయ విద్యాలయంలో సీటు లభించడమే విద్యార్థుల అదృష్టంగా భావించాలని, తర్వాత కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించడం సులువని అన్నారు. దీనికి తానే నిదర్శనమని అన్నారు. విద్యాలయంలోని అన్ని సదుపాయాలను సద్వినియోగం చేసుకొని తాను ఎలాంటి శిక్షణ లేకుండా యుపీఎస్సీలో 457వ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి మాట్లాడుతూ ఈ సమ్మేళనానికి ఇతర రాష్ట్రాల నుండి కూడా విద్యార్థులు తరలిరావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ విద్యాలయంలో విద్యను అభ్యసించి ఉన్నత పదవులలో విద్యార్థులు ఉండడం సంతోషకరమని అన్నారు. దీనికి ముందు పూర్వ విద్యార్థులంతా విద్యాలయం తిరుగుతూ అక్కడి సదుపాయాలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ టి దామోదర్‌రావుతో పాటు విద్యాలయం అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యాలయంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎమ్మెల్యేను కలిసిన ప్రజా ప్రతినిధులు, వీడీసీ సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి మాజీ ఎంపిటిసి చింతల కిషన్, బోర్వెల్ రాజేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. తిర్మన్ పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపు గోవర్ధన్ అధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటి సారిగా గ్రామం మీదుగా వెళ్తుండగా మాజీ ఎంపిటిసి చింతల కిషన్, రాజేందర్ రెడ్డి కలిసి ధర్పల్లి రాహదారికి ఆనుకుని ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించాలని కోరిన వెంటనే ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయన్ని నూతనంగా నిర్మించడానికి సహాయ సహకారాలు అందజేయాలని గ్రామ గౌడ సంఘ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. అలయ విశిష్టత గురించి అడిగి తెలుసుకుని దేవాదాయ శాఖ నుండి నిధుల మంజూరు కు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, డైరెక్టర్ కోరట్ పల్లి అనంద్, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, సంతోష్ రెడ్డి, కంచెట్టి గంగాధర్, డాక్టర్ శాదుల్లా, డాక్టర్ శ్రీనివాస్, బైరయ్య ఎల్ఐసి గంగాధర్, హబిబ్ ,ప్రవీణ్ గౌడ్,రాజ పాల్గొన్నారు.

గిరిజన మహిళను జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవాలి

- మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిడాం గణపతి

నవతెలంగాణ-బెజ్జూరు

ఆసిఫాబాద్ జడ్పీ చైర్మన్‌గా గిరిజన మహిళా జడ్పీటీసీని ఎన్నుకోకపోతే ఉద్యమిస్తామని మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న కోవలక్ష్మి రాజీనామా చేయడంతో ఖాళీ అయిన పదవిని తాత్కాలికంగా వైస్ చైర్మన్‌కు నియమించారని, వారం రోజుల్లో కొత్త గిరిజన మహిళా జడ్పీ చైర్మన్‌ను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆదివాసులకు అన్ని విధాలుగా అన్యాయం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ నెంబర్ 30ని ఎత్తివేయడంతో పాటు 1/70 చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఏజెన్సీలో రియలెస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వెంటనే జిల్లా పరిషత్ చైర్మన్‌ను గిరిజన మహిళకు కట్టబెట్టాలని సూచించారు. లేనిపక్షంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వారం రోజుల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కోకన్వీనర్ సోయం చిన్నయ్య, గిరిజన నాయకులు భిక్షపతి, రాజారాం, తలండి రాజు, ఆత్రం మధూకర్, ప్రకాష్, అరుణ్, తోటపెల్లి సత్తయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
4
సోమవారం | డిసెంబర్ 18, 2023 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో చేరిన ఉమ్రి గ్రామస్తులు

నవతెలంగాణ-తలమడుగు



కాంగ్రెస్ పార్టీలో మండలంలోని ఉమ్రి గ్రామస్తులు చేరారు. ఆదివారం జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో వారు చేరాగా కండువలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేండ్ల కాలంలో గ్రావమాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. గ్రామంలో కమ్యూనిటీ హాలును మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బొల్లారం బాబన్న, ఎంపీటీసీలు పెందూరు మాధవ్, వెంకన్న యాదవ్, కమలాకర్, సోమన్న, గంగారం, కాంతారావు, కృష్ణ, రామారావు పటేల్, మాధవరావు, ప్రతాప్, గాజుల సాంబ శివ్, లక్ష్మన్న, నిట్టెడి అశోక్, రఫిక్, బాధ సుభాష్ పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణోత్సంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



బంగారిగూడలోని ఆదివారం పురాతన పద్మావతి అలివేలు మంగమ్మ సమేత వెంకటేశ్వర స్వామీ ఆలయంలో జరుగుతున్నా స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరు కాగా ఆయనకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో పూర్ణ కుంభం మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఆలయంలో వసతులు కల్పించడంతో పాటు అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, రవి, దేవేందర్, కృష్ణ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించేల పాలన సాగాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జిల్లా అభివృద్ధికి నోచుకోలేదని, ఎమ్మెల్యే పాయల శంకర్ ఆదిలాబాద్ అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేల పాలన సాగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వందల కోట్లతో నిర్మించిన రిమ్స్ సూపర్ స్పెషలిటిలో వైద్యులు లేరన్నారు. పత్తికి ఆదిలాబాద్ పెట్టింది పేరని కానీ ఇక్కడ వసతులు లేవన్నారు. కేంద్రంలో బీజేపీయే ఉందని, ఇక్కడ ఎమ్మెల్యే బీజేపీకి చెందిన వారే ఉన్నారని టెక్స్‌టైల్ పార్క్, గిరిజన యూనివర్సిటితో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పనులను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జిల్లాను అభివృద్ధి చేసేలా నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ అసెంబ్లీలో ఇక్కడి సమస్యలపై మాట్లాడాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, చిలుక దేవిదాస్, మేస్రం భాస్కర్, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు నర్సింగ్ రావు, పెద్ది నర్సింలు పాల్గొన్నారు.

ఎన్నికలు ఏవైనా గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నవతెలంగాణ-బేల

వచ్చే ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. తాను ఓడిపోయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటానని, తనపై నమ్మకంతో ఓటేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక నుండి ప్రతి కార్యకర్త పట్టుదలగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ బలోపేతానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బేల మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్, మాజీ ఎంపీపీ బాపూరావు హుల్కె, ఘనశ్యామ్, శంకర్ భోక్రె, ఠాక్రె విపిన్, అవినాష్ గోడే, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు నిర్మల్ అగ్నిమాపక కేంద్రంలో వేలం పాట

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిర్మల్ అగ్నిమాపక కేంద్రంలో కాలం చెల్లిన వస్తువులకు 19న వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఆదిలాబాద్ డివిజనల్ అగ్నిమాపక అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్మల్‌లోని అగ్నిమాక కేంద్రంలో హాజరు కావాలని సూచించారు. నిబంధనలకు లోబడి వేలం ఉంటుందని పేర్కొన్నారు.

20న క్రాస్ కంట్రీ పరుగు ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో క్రాస్ కంట్రీ పరుగు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అడ్డిబోజారెడ్డి, పి.రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-16, 18, 20, మెన్, ఉమెన్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు సంబంధిత వయస్సు ధృవీకరణ పత్రం బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, ఎస్ఎస్‌సీ మెమోతో ఉదయం 8 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు సెల్: 9492136510 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఈ-కేవైసీ కోసం వచ్చి.. మృతి చెందాడు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ-కేవైసీ అప్డేట్ కోసం వచ్చి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లాలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ మండలంకు చెందిన అంగ పొచ్చన్న శనివారం జిల్లా కేంద్రానికి వచ్చాడు. తీర్పెల్లిలోని ఇండియన్ గ్యాస్‌కు ఈ-కేవైసీ అప్డేట్ కోసం తన కుమారుడు చరణ్‌తో వచ్చాడు. అయితే అప్డేట్ కోసం చాలామంది లైన్‌లో ఉండడంతో ఆలస్యం అవుతుందని కొడుకు చరణ్‌తో చెప్పి ఇంటికి వెళ్లామన్నాడు. రాత్రి అయిన పొచ్చన్న ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వెతికారు. ఇండియన్ గ్యాస్ దగ్గర వెళ్లి చూడగా అక్కడ ఉన్న రెండు లారీల మధ్య పడుకొని ఉన్నాడు. కుటుంబీకులు ఆయనను లేపడానికి యత్నించగా మరణించినట్టు తెలిసింది. పోస్టుమార్టం నిమితం రిమ్స్‌కు మృతదేహన్ని తరలించామని, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు.

ఘనంగా వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల జన్మదినాన్ని ఆ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి షర్మిలకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పెంధుర్ మనోహర్, కోఆర్డినేటర్ సర్సం రాహుల్, జిల్లా యువజన అధ్యక్షుడు కృష్ణంరాజు, మండల అధ్యక్షుడు మాణిక్‌రావు, ఉగ్గే శ్రీను, విజయ్, శ్రీను పాల్గొన్నారు.

ఆగని తెల్ల బంగారం దళారీ దంధా..!

- సిండికేట్‌గా మారిన వ్యాపారులు
- రైతుల వద్ద కొనుగోలు సీసీఐలో అమ్మకాలు
- ఆదాయం కోల్పోతున్న మార్కెట్
- వ్యవసాయ మార్కెట్‌లో జరగని కొనుగోలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పత్తి పంటకు దళారుల పాలుకాకుండా ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుంది. ప్రభుత్వం ఈ ఏడు పత్తి పంట క్వింటాల్‌కు కనీస మద్దత్తు ధర రూ.7, 020గా నిర్ణయించింది. అయితే దళారులు గిరిజన గ్రామాల్లో రంగ ప్రవేశం చేసి తూకం, ధరల్లో మోసం చేస్తూ దర్జాగా కొనుగోలు చేస్తున్న వీరిని పట్టించుకునే వారే కరువయ్యారు. ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో నార్నూర్, గాదిగూడ తదితర మండలాలు వస్తాయి. ఈ మార్కెట్ పరిధిలో ఇంద్రవెల్లిలో 25, నార్నూర్‌లో 07, గాదిగూడలో 11మంది లైసెన్స్ పొందిన ట్రేడర్స్ ఉన్నారు. లైసెన్సు లేని అనేక మంది వారాంతపు సంత వస్తే చాలు మార్కెట్ ధరలో రూ. 200 తగ్గించి తూకం, ధరల్లో మోసం చేస్తూ కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిరిజన రైతులు ఆర్థికంగా దళారుల చేతిలో నష్ట పోతున్నారు. వీరి అక్రమ ధందాను ఆరికట్టాల్సిన మార్కెట్ శాఖ అధికారులు విఫలమవుతున్నారే విమర్శలు వస్తున్నాయి.

మార్కెట్ కాంటాలో తూకం చేయని వైనం..

పత్తి కొనుగోళ్లను మార్కెట్ యార్డు ద్వారానే కొనుగోళు చేయాలనే నిబంధన ఉంది. ఈ నిబంధన మాత్రం ఎక్కడ మాత్రం అమలు కావడం లేదు. అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా కొందరు వ్యాపారస్తులు ఒకటే లైసెన్సు పొంది రెండేసి దుకాణాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్నారు. దీంతో దళారులను నియమించి గిరిజన పల్లెల్లోకి వెళ్లి తూకం, ధరల్లో మోసం చేస్తూ పత్తిని మాక్స్ వాహనాల ద్వారా మండల కేంద్రంలో ట్రేడర్‌లకు విక్రయించడం పరిపాటిగా మారింది. వ్యాపారులు ఇదే పత్తిని రైతుల పేరిట సీసీఐలో అధిక ధరకు అమ్మి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు.

సిండికేట్‌గా మారిన వ్యాపారులు..

వ్యాపారులు సీసీఐ సిబ్బందితో కుమ్మక్కై సిండికేట్‌గా మారి అక్రమ దందాను కొనసాగుతున్నారు. వ్యాపారస్తుల పత్తికి నామమాత్రంగా తనిఖీ(తేమ శాతం) చూసి వదలి పెడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అదే రైతుల పత్తికి తేమ శాతం పేరిట కోతలు విధిస్తున్నారు. దీంతో సీసీఐ సిబ్బందిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలో మూడు జిన్నింగ్‌లలో ఇప్పటి వరకు సీసీఐ ద్వారా 26,635 క్వింటాళ్ల పత్తి కొనుగోళు జరిగితే ప్రైవేట్ ట్రేడర్‌ల ద్వారా 1620 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసినట్లు మార్కెట్ అధికారుల గణంకాలు చెబుతున్నాయి. దీని ఆధారంగా సీసీఐ ద్వారా ఎంత పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారనేది లైసెన్స్ చెల్లించకుండా మార్కెట్ ఆదాయానికి గండి కొడుతున్న విషయం తెలిసిపోతుంది.



కొనుగోళ్లు లేక బోసిపోయిన ఇంద్రవెల్లి మార్కెట్ యార్డు



గ్రామాల్లో పత్తిని వాహనాల్లో నింపుతున్న దృశ్యం

మార్కెట్ యార్డులో కొనుగోలు చేయరా...

రైతులు పండించిన పండిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు ఎలాంటి మోసం జరగవద్దనే ఉద్దేశ్యంతో మార్కెట్ యార్డులో కొనుగోళ్లు చేపట్టాలన్నది నిబంధన. తూక, ధరల్లో మోసం చేయకుండా స్థానిక మార్కెట్ యార్డులోనే కొనుగోళు చేయాలి. కానీ ఇలాంటేవి ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులో జరగడం లేదు. రైతులను మోసం చేసేల ఇక్కడి వ్యాపారులు వ్యవహరిస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఇక నుంచి అయిన రైతులకు న్యాయం జరిగేలా మార్కెట్ యార్డులోనే తూకం జరిగేల చూడాలని రైతులు కోరుతున్నారు.

చెక్‌పోస్టులు లేక మహారాష్ట్రకు తరలుతున్న పత్తి..

ఇంద్రవెల్లి మార్కెట్ పరిధిలోని గాదిగూడ, నార్నూర్ మండలాల నుంచి ప్రతినిత్యం వందల క్వింటాళ్ల పత్తి మహారాష్ట్రకు తరలుతోంది. సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయకపోవడంతో మార్కెట్‌కు రావాల్సిన ఆధాయానికి గండిపడుతుంది. ఈ విషయం అధికారుల దృష్టిలో ఉన్న కూడా దళారి వ్యవస్థను ప్రోత్సహించేల చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి దళారీ దందాను అరికట్టి రైతులను ఆదుకోనేల చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

పొంతన లేని సమాధనం..

లైసెన్స్ లేకుండా జరుగుతున్న పత్తికొనుగోళ్లపై మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా పొతన లేని సమాదానం చెప్పారు. చెక్ పోస్టును ఏర్పాటు చేస్తే సెక్యూరిటీ కావాలని, గ్రామాల్లో కొనుగోలు చేస్తే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ యార్డులో కొనుగోలుపై రైతులపై దూరభారం పెరుగుతుందని, అందుకే వారు వారంతపు సంతలో విక్రయించుకున్నారనేలా సమాదానం చెప్పారు. అధికారి తీరుపై విమర్శలున్నాయి.

మార్కెట్ యార్డులోనే కొనుగోలు చేయాలి

సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షులు



రైతులు పండించిన పత్తి పంటను వ్యవసాయ మార్కెట్ యార్డులోనే కొనుగోలు చేయాలి. ప్రైవేట్ ట్రేడర్‌ల వద్ద తూకం, ధరల్లో మోసం దోపిడీని ఆరికట్టాలి. వారి గోదాంల తనిఖీలు చేయాలి. లైసెన్సు లేని దళారులపై కేసులను నమోదు చేయాలి. వారాంతపు సంతలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలి. అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించి చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలి.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

నతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కోరారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 35 రోజుల సమ్మె చేశారన్నారు. సమ్మెకు నూతనంగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ నాయకత్వం కార్మికుల డిమాండ్లను మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరారు. అదే విధంగా నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా ఎన్నికల ముందు కార్మికులు చేసిన సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరోసారి ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి బొజ్జ ఆశన్న, యూనియన్ మండల నాయకులు అడెల్లు, పోశెట్టి, లక్ష్మన్న, ఇంద్రజ, రాజు, సంతోష్, యశ్వంత్, వెంకట్‌రావ్, సుందర్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

ఘనంగా పెన్షనర్స్ డే వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో కార్యక్రమం ఏర్పాటు చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు చేసి అలరించారు. అనంతరం పెన్షనర్స్ డే ఆవశ్యకతను అతిథులు తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ 1982లో డిసెంబర్17న పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు గౌరం, మర్యాదలకు హామీ ఇస్తు సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పెన్షన్‌దారుల సమస్యలు, వారి పరిరక్షణకు సంఘం పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, అసోసియేటెడ్ అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఇంద్రరెడ్డి, గోపీనాథ్ గౌడ్, నందయ్య, అయ్యన్న, భూమన్న సుదీర్ ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి : తపస్



సమావేశంలో నినాదాలు చేస్తున్న తపస్ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదేండ్లుగా ఉపాధ్యాయ, విద్యరంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని దీంతో అనేక నూతన సమస్యలు వచ్చాయని, రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షులు సునీల్ చౌహన్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముందుగా నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలయజేశారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలపై పలు తీర్మాణాలు చేశారు. వాటిని రాష్ట్ర శాఖ ద్వారా ప్రభుత్వానికి అందజేయడం జరిగిందన్నారు. ప్రతి నెల ఒకటవ తేదిన జీతాలు చెల్లించాలన్నారు. 30 శాతం ఫిట్ మెంట్‌తో నూతన పీఆర్సీ అమలు చేయాలని, అప్పటి వరకు 15 శాతం ఐఆర్ ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి, ఉపాధ్యాయ పదోన్నతులకు మార్గం సుగుమం చేయాలన్నారు. నిలిచిపోయిన ఎస్జీటీ బదిలీలు నిర్వహించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించటంతో పాటు ఎస్జీటీ ఉపాధ్యాయుడికి లీజరే పిరియడ్ కేటాయించాలన్నారు. ఎస్జీటీలకు ఏమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలులో ఉపాధ్యాయులపై ఉన్న ఒత్తిడి తగ్గించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజూ గోపికృష్ణ, నాయకులు నారాయణ, మనోజ్ రెడ్డి, గంగాధర్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'పదేండ్ల పాలనలో జిల్లా అభివృద్ధికి నోచుకోలేదు'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదేండ్ల బీఆర్ఎస్, బీజేపీ పాలనలో ఆదిలాబాద్‌కు ఎలాంటి న్యాయం జరగలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడ్లారు. అభివృద్ధిని వదిలి ఈ రెండు పార్టీలు విమర్శలకు చేసుకున్నాయని ఆరోపించారు. ఎయిర్ పోర్ట్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ఆదిలాబాద్ ఆర్మూర్ రైల్వే లైన్, సీసీఐ పునరుద్ధరణ, రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ తదితర వాటివి హామీలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల సంక్షేమం కోసం ప్రకటించిన ఆరు గ్యారంటిల్లో రెండు అమలు చేసిందని, మిగితావి కూడా త్వరలో అమలు చేస్తుందన్నారు. దానికి సీపీఐ పూర్తి సహకారం అందిస్తున్నారు. డబల్ బెడ్రుం, ఇంటి స్థలం ఇవ్వలేని కేసీఆర్ ప్రభుత్వం నేడు వారం రోజులు కాకున్న సీపీఐ పొత్తుతో కూడిన కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి నాయకత్వంలో ఆరు గ్యారెంటీ అమలు అవుతున్నాయన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ అరుణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సీనియర్ నాయకులు షేక్ పాషా,పెద్ది నరసింలు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కామ్లే రాందాస్, దత్తు, నర్సింగ్ రావు, లక్ష్మణరావు ఉన్నారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం కూడా కైవసం కావాలి

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సునీల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌లో బీజేపీ నాలుగు స్థానాలు సాధించి పట్టును బిగించిందని, పార్లమెంట్ స్థానం కైవసం చేసేల ఎమ్మెల్యేలు కృషి చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సునీల్ బన్సల్ అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. జనవరి నెలలో స్థానిక సంస్థలు, తరువాత పార్లమెంట్ ఎన్నికలు జరిగే ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ముందుగానే పార్లమెంట్ స్థానాలు తెలంగాణలో అత్యధికంగా గెలుపొందాలనే లక్ష్యంతో పార్టీ ఉందన్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే వారి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం మరింత కృషి చేసి ఆదిలాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ గెలుపొందేల కార్యాచరణను సిదం చేస్తు కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటిస్తు వారికి తగు సూచనలు చేయాలన్నారు. అదే విధ:గా కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీ సోయం బాపురావ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, మహేశ్వర రెడ్డి, రామారావు పటేల్, పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, ఉమ్మడి జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సునీల్

పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన అనిల్ చల్లవార్ అయ్యప్ప స్వామి మహా పడిపూజను నిర్వహించారు. శనివారం రాత్రి జరిగిన పూజలకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు. ముందుగా మెట్ల పూజ చేశారు. అనంతరం స్వామి వారిని కీర్తిస్తూ భజనలు సంకీర్తనలు చేశారు. కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను గురుస్వాములు శాలువతో సత్కరించి ఆశీర్వాచనలు అందించారు.